నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

**ఆటవెలది**

లింగరూపధారి భంగముల్ కల్గినా
చేరిమనలగాచు చిత్రముగను
హరహరయని పలికి హారతులీయగా
పాపములనుబాపు పాపహరుడు

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు


విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 336 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 29-03-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

## ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు

- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం.
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష
- హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక.
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సీఎం రేవంత్

**రంగారెడ్డి మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

-మిగతా 2 లో





# ఐపీఎల్ 2026లో ఆర్సీబీ బోణీ

- సన్‌రైజర్స్‌పై 6 వికెట్ల తేడాతో విక్టరీ
- తేలిపోయిన సన్ రైజర్స్ బౌలర్లు

**న్యూఢిల్లీ**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంతో ఆరంభించింది. శనివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచులో ఆర్సీబీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. సన్ రైజర్స్ నిర్దేశించిన 202 పరుగుల లక్ష్యాన్ని 15.4 ఓవర్లలోనే ఛేదించింది. ఛాంపియన్ ఆటకు అర్థం చెబుతూ అదరగొట్టింది. 202 పరుగుల

-మిగతా 2 లో



# బెట్టింగ్ ఊబిలో పడొద్దు..

- బతుకును ఛిద్రం చేసుకోవద్దు
- ఐపిఎల్ ప్రారంభంతో యువతకు సిపి సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్**
బెట్టింగ్ ఊబిలో పడొద్దు.. బతుకును ఛిద్రం చేసుకోవద్దని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా యువతను హెచ్చరించరు. ఐపీఎల్ సీజన్ మొదలవుతున్న తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం అన్నారు. వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చింది. కేవలం డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై మా ప్రత్యేక నిఘా

-మిగతా 2 లో





# గల్ఫ్ దేశాలకు ఇరాన్ వార్నింగ్

- శత్రుదేశాలకు మీ భూమిని ఇవ్వొద్దు..
- అలా చేస్తే శత్రుస్థావరాలు భూస్థాపితం అయ్యేవరకు మేం దాడులు చేస్తూనే ఉంటాం.
- 'మేం ముందుగా ఏ దేశంపైనా దాడి చేయబోమని ఎన్నోసార్లు చెప్పాం
- మా ఆర్థిక మూలాలు, నిర్మాణాలపై దాడి జరిగినప్పుడు మాత్రమే మేం ఎదురుదాడి చేస్తాం

**న్యూఢిల్లీ**
అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం కొనసాగుతున్న వేళ పొరుగునే ఉన్న గల్ఫ్ దేశాలకు ఇరాన్ కీలక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ శత్రుదేశాలైన అమెరికా, ఇజ్రాయెల్‌లకు తమ దేశాల్లో చోటు ఇవ్వొద్దని సూచించింది. గల్ఫ్ దేశాల్లో అమెరికా మిలిటరీ స్థావరాలు ఏర్పాటు చేసుకుని, అక్కడ్నుంచి ఇరాన్‌పై దాడిచేస్తోంది. అందువల్ల తమ దేశంపై దాడి చేసేందుకు అనువుగా అమెరికా సహా ఏ దేశానికి స్థలం ఇవ్వొద్దని ఇరాన్ కోరింది.ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ శనివారం ఒక ప్రకటన చేశారు. సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్, కువైట్, ఖతార్ దేశాలు ఈ ప్రాంతంలో అభివృద్ధి, రక్షణ కోరుకుంటే తమ శత్రుదేశాల సైన్యాన్ని వారి భూభాగంలోకి అనుమతించకూడదని సూచించారు.

-మిగతా 2 లో



# యుద్ధం సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడింది

2 లో

# భార్యతో అసహజ శృంగారం నేరం కాదు..

## మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు



2 లో


# కాళేశ్వరం అవినీతికి కేసీఆర్ బాధ్యుడు

## అవినీతిని పట్టుకోవడంలో సీఎం రేవంత్ విఫలం

- ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం
- సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది.
- రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు.
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

**కరీంనగర్ మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా

-మిగతా 2 లో



# బెంగాల్‌ను టార్గెట్ చేస్తే.. కేంద్రంలో బీజేపీని గద్దె దింపుతా

- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగిస్తుంది
- బీజేపీ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టింది
- రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం

**న్యూఢిల్లీ**
పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పై తీవ్ర విమర్శలు చేశారు. ముర్షిదాబాద్ లో శుక్రవారం రామనవమి శోభాయాత్ర జరుగుతున్న సమయంలో ఘర్షణలు చోటుచేసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. పశ్చిమబెంగాల్‌ను ధ్వంసం చేయాలని చూస్తే బీజేపీ దేశంలో అధికారం కోల్పోవడం ఖాయమని అన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఢిల్లీని స్వాధీనం చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలతో కలిసి

-మిగతా 2 లో



# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సీఎం రేవంత్



**హైదరాబాద్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది.

-మిగతా 2 లో



# యుద్ధం ఎఫెక్ట్..

- తీవ్ర ఇంధన సంక్షోభంలో పాకిస్థాన్..
- గ్యాస్ సిలిండర్ ధర ఎంతో తెలుసా..?

**న్యూఢిల్లీ**
యుద్ధం కారణంగా దాయాది దేశం పాకిస్థాన్ తీవ్ర ఇంధన సంక్షోభంలో చిక్కుకున్నది. పశ్చిమాసియా లో నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో అక్కడ లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. దేశవ్యాప్తంగా 11.67 కిలోల గ్యాస్ సిలిండర్ ధర.. పాకిస్థాన్ రూపాయల్లో ఏకంగా రూ.5,135 స్థాయికి పెరిగింది. పంజాబ్ ప్రావిన్స్ లో

-మిగతా 2 లో

# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

మొదటి తరువాయి

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరు నూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది. సముద్ర పరీవాహకంలో వ్యాపారం, ఆర్థిక అభివృద్ధి జరిగింది. మూసా, ఈసా నదులు ఉన్నా సరైన విధంగా మనం ఉపయోగించుకోలేదు. మానవ తప్పిదాలతోనే మూసీ కాలుష్య కారకంగా మారిందని దానిని మార్చాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, సిఎస్ రామకృష్ణారావు,డిజిపి శివధర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# యుద్ధం సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

### అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడింది

న్యూఢిల్లీ



పశ్చిమాసియా లో ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న యుద్ధంతో ప్రపంచ దేశాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. పలు దేశాలను ఇంధన కొరత ఇబ్బందులకు గురిచేస్తున్నది. ఈ క్రమంలో యుద్ధం విసురుతున్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రధా నరేంద్ర మోదీ అన్నారు. శనివారం నొయిడా లో అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. అక్కడ నెల రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోందని చెప్పారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందని తెలిపారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ సంక్షోభం నుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయవద్దని ప్రత్యర్థి రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు దేశ ప్రయోజనాలకు, దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయని ప్రధాని చెప్పారు. కాగా నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంటుంది. సరకు రవాణా కోసం కార్గో–లాజిస్టిక్ జోన్‌లను అనుసంధానిస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌ను కూడా నిర్మించారు.

# భార్యతో అసహజ శృంగారం నేరం కాదు..

### మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు

న్యూఢిల్లీ



ఓ కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. భార్య తో 'అసహజ శృంగారం' జరిపారన్న ఆరోపణలపై భర్త మీద ఐపీసీ సెక్షన్ 377 కింద కేసు నమోదు చేయడం చెల్లదని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్వాలియర్ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే.. మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లాకు చెందిన ఓ మహిళ తన భర్తపై తీవ్ర ఆరోపణలు చేసింది.తన భర్త తనపై అసహజ శృంగారానికి పాల్పడ్డాడని, వరకట్నం కోసం వేధించాడని, దాడిచేసి బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు ఆమె భర్తపై సెక్షన్ 377 (అసహజ నేరాలు), 498ఏ (వరకట్న వేధింపులు), 323 (దాడి), 506 (బెదిరింపులు) కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని కోరుతూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మిలింద్ రమేష్ ఫడ్కే, సెక్షన్ 377 కింద నమోదైన కేసును కొట్టివేశారు.వివాహిత దంపతుల మధ్య జరిగే లైంగిక చర్యలను ఈ సెక్షన్ కింద నేరంగా పరిగణించలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. వైవాహిక బంధంలో భర్త తన భార్యతో చేసే లైంగిక చర్య అత్యాచారం కాదని సెక్షన్ 375 లో ఉన్న మినహాయింపును కోర్టు ప్రస్తావించింది. అందువల్ల భార్యాభర్తల మధ్య జరిగే అసహజ సంభోగాన్ని కూడా సెక్షన్ 377 కింద నేరంగా చూడలేమని స్పష్టంచేసింది. అయితే వరకట్న వేధింపులు, దాడి, బెదిరింపులకు సంబంధించిన ఇతర సెక్షన్ల కింద కేసులను కొట్టివేయడానికి కోర్టు నిరాకరించింది. అసహజ శృంగార ఆరోపణ మినహా ఇతర ఆరోపణలపై విచారణ కొనసాగించాలని ఆదేశించింది. ఇటీవల గ్వాలియర్–చంబల్ ప్రాంతంలో వైవాహిక వివాదాల్లో సెక్షన్ 377ను ఆయుధంగా వాడుతున్నారని కోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

# కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

మొదటి తరువాయి

మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపి పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆర్ఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

మొదటి తరువాయి

నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్–1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్–2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్–1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ్' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్–2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్–2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది.

# ఐపీఎల్ 2026లో ఆర్సీబీ బోణీ

మొదటి తరువాయి

లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ 7 బంతుల్లో 8 రన్స్ చేసిన తర్వాత ఔట్ అయ్యాడు. అయితే ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దేవ్‌దత్ పడిక్కల్‌తో విరాట్ కోహ్లీ .. మెరుపు భాగస్వామ్యం నమోదు చేశాడు. తొలుత పడిక్కల్ ఎదురుదాడికి దిగగా.. ఆపై కోహ్లీ కూడా జాయిన్ అయ్యాడు. దీంతో ఆర్సీబీ స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఎప్పుడెప్పుడు మ్యాచ్ ముగిద్దామా అన్నట్లు ఆర్సీబీ ప్లేయర్లు బ్యాటింగ్ చేశారు.కోహ్లీ, పడిక్కల్ కలిసి మూడో వికెట్‌కు 45 బంతుల్లో 101 రన్స్ చేసి.. జట్టు విజయాన్ని ఖరారు చేశారు. 26 బంతుల్లో 61 రన్స్ చేశాక పడిక్కల్ ఔట్ అయినా.. కోహ్లీ మాత్రం తగ్గలేదు. చివరి వరకు క్రీజులో ఉండి జట్టును గెలిపించాడు. కోహ్లీ ఈ మ్యాచులో 38 బంతుల్లో 69 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. కెప్టెన్ రజత్ పాటీదార్ 12 బంతుల్లో 31 రన్స్ చేసి విజయంలో తన వంతు పాత్ర పోషించాడు. దీంతో ఆర్సీబీ 15.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఐపీఎల్ 2026ను విజయంతో ఆరంభించింది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ 38 బంతుల్లో 80 రన్స్ చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఆర్సీబీ బౌలర్లలో జాకబ్ డఫీ.. 4 ఓవర్లలో 22 రన్స్ ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. ఐపీఎల్ 2026లో భాగంగా ఆదివారం ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగనుంది.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు..

మొదటి తరువాయి

ఉంటుందని సజ్జన్నార్ హెచ్చరించారు. బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా మా వాట్సాప్ నంబర్ 94906 16555 కు సమాచారం ఇవ్వండని శనివారం వీడియో షేర్ చేశారు. క్రికెట్ అభిమానులకు ఐపీఎస్–2026 పండుగ మొదలైంది. శనివారం రాత్రి 07:30 గంటలకు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. ఐపీఎల్ 19వ సీజన్ మే 31 వరకు నిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తంగా 10 జట్లు తలపడనుండగా.. 74 మ్యాచ్‌లు జరుగనున్నాయి. అయితే, ఐపీఎల్ అంటే గుర్తొచ్చే మరో విషయం బెట్టింగ్. ఈ సమయంలో బెట్టింగ్ రాయుళ్లు రెచ్చిపోతుంటారు. అమయాక యువతను లక్ష్యంగా చేసుకుని కోట్లు దండుకుంటుంటారు. ఐపీఎల్ వేళ వందల కోట్ల రూపాయలు చేతులు మారుతుంటాయి. ఈ సందర్భంగా యువతకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బెట్టింగ్ వల్ల అప్పులు పెరిగి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దాని జోలికి వెళ్లకుండా క్రికెట్‌ను కేవలం క్రీడగా మాత్రమే ఆస్వాదించాలని యువతకు పిలుపునిచ్చారు.

# గల్ఫ్ దేశాలకు ఇరాన్ వార్నింగ్

మొదటి తరువాయి

ఈ సందర్భంగా పెజెష్కియాన్ ఎక్స్ వేదికగా స్పందించారు. "మేం ముందుగా ఏ దేశంపైనా దాడి చేయబోమని ఎన్నోసార్లు చెప్పాం. మా ఆర్థిక మూలాలు, నిర్మాణాలపై దాడి జరిగినప్పుడు మాత్రమే మేం ఎదురుదాడి చేస్తాం. ఈ ప్రాంతంలోని పొరుగు దేశాలకు చెప్పేదేంటంటే.. శత్రువులు మాపై యుద్ధానికి మీ నేలను వాడుకోనివ్వకండి. అలా చేస్తే శత్రుస్థావరాలు భూస్థాపితం అయ్యేవరకు మేం దాడులు చేస్తూనే ఉంటాం. వారికి సహకరించిన వారిని కూడా వదలబోం" అని ఆయన పేర్కొన్నారు.గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లోని చమురు క్షేత్రాలపై కూడా దాడులు జరిగాయి. దీంతో ఆయా దేశాలకు తీవ్ర నష్టం జరిగింది. దీని ఫలితంగా చమురు ఉత్పత్తి భారీగా తగ్గిపోయే అవకాశం ఉంది. మరోవైపు అమెరికా, ఇరాన్ మధ్య చర్చల ప్రతిపాదన వచ్చింది. కానీ, ఈ విషయం ఒక కొలిక్కి రావడం లేదు. చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి.

## బెంగాల్‌ను టార్గెట్ చేస్తే..

# కేంద్రంలో బీజేపీని గద్దె దించుతా

మొదటి తరువాయి

ముందుకు వెళ్తానని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని రాణిగంజ్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడారు.రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇళ్ల పైకి బుల్డోజర్లను ప్రయోగించి ప్రజలందరినీ బయటకు గెంటేస్తారని మమత ఓటర్లను హెచ్చరించారు. తమ గెలుపు కోసం దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుంటూ బీజేపీ నేతలు అన్ని హద్దులను దాటుతున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ ఆదేశాల మేరకే ఎన్నికల సంఘం రాష్ట్రంలో ఎలక్షన్స్‌కు ముందు హడావిడిగా 'సర్' ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. ఓటరు జాబితా నుంచి బెంగాలీ ఓటర్లను తొలగించడానికి ఎన్నికల కమిషన్‌ను బీజేపీ పావులా వాడుకుంటోందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేకుండా చేయడం, ఆ పార్టీ నుంచి దేశాన్ని రక్షించడమే తృణమూల్ కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. రాణిగంజ్‌లోని పర్వత ప్రాంతాల్లో తరచూ కొండచరియలు విరిగిపడుతుండడం వల్ల అక్కడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని మమత ఆవేదన వ్యక్తంచేశారు. ఇటువంటి ప్రమాదకర ప్రాంతాలను విడిచిపెట్టి.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లే వారికి తమ ప్రభుత్వం గృహవసతితోపాటు రూ.10 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. బెంగాల్‌లో గెలువగానే దేశంలోని ఇతర రాజకీయ పార్టీలతో కలిసి కేంద్రంలో బీజేపీని గద్దె దించుతానని హెచ్చరిక చేశారు.

# యుద్ధం ఎఫెక్ట్..

మొదటి తరువాయి

ఈ ధరల పెరుగుదల మరీ ఎక్కువగా ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు తెలుపుతున్నాయి.గ్యాస్ ధరల పెరుగుదల సామాన్య ప్రజల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఎల్పీజీతో నడిచే ఆటోలు, బస్సులు, మినీ బస్సుల రవాణా చార్జీలు పెరగడంతో తక్కువ, మధ్యతరగతి ఆదాయ వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు ఈద్, నౌరోజ్ సెలవుల కారణంగా ఇరాన్ నుంచి గ్యాస్ సరఫరా గణనీయంగా తగ్గింది. దాంతో సంక్షోభం మరింత తీవ్రమైంది. పాకిస్థాన్‌లో ఇంధన నిల్వలు కూడా ప్రమాదకర స్థాయిలో అడుగంటిపోయాయి. దేశంలో కేవలం 11 రోజులకు సరిపోయేంత మాత్రమే ముడి చమురు ఉంది.అదేవిధంగా 27 రోజులకు సరిపోయే పెట్రోల్, 21 రోజులకు సరిపోయే డీజిల్, 9 రోజులకు సరిపోయే ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ పెట్రోలియం శాఖ కార్యదర్శి సెనేట్ కమిటీకి తెలిపారు. పాకిస్థాన్ తన పెట్రోలియం అవసరాల్లో దాదాపు 70 శాతం మధ్యప్రాచ్యం నుంచే దిగుమతి చేసుకుంటున్నది. ప్రస్తుత సంక్షోభంవల్ల సరఫరా మార్గాలు దెబ్బతిన్నాయి. సరఫరాలో అంతరాయాల కారణంగా ఏప్రిల్ 14 తర్వాత దేశంలో తీవ్రమైన గ్యాస్ కొరత ఏర్పడవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం

**200 క్రిమినల్ కేసులు, 616 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 5 సివిల్ కేసులు, 8 బ్యాంకు కేసుల పరిష్కారం**



**షాద్ నగర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా కోర్టు పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ విజయవంతంగా ముగిసింది. అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. స్వాతి రెడ్డి ఆదేశాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సివిల్, క్రిమినల్, బ్యాంకు, డ్రంక్ అండ్ డ్రైవ్, పిట్టి కేసుల పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నారు. రోజంతా సాగిన లోక్‌అదాలత్‌లో 200 క్రిమినల్ కేసులు, 616 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 5 సివిల్ కేసులు, 8 బ్యాంకు కేసులు పరిష్కరించబడ్డాయి. రాజీమార్గమే రాజమార్గంగా సాగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది, కక్షిదారులు చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసుల పరిష్కారానికి చొరవ చూపిన న్యాయవాదులను, పోలీసులను, కోర్టు సిబ్బందిని, కక్షిదారులను 16వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్. స్వాతి రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్‌కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పట్టణ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసమూర్తి, లైబ్రరీ సెక్రటరీ కోటి జయమ్మ, కోశాధికారి రహీముద్దీన్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ శంకర్, మాజీ ప్రధాన కార్యదర్శి గుండుబావి శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి, టి. ఆంజనేయులు గౌడ్, చెట్ల శంకర్, గోపాలచారి, గంతల నాగరాజు, సయ్యద్ ఖలీల్, బ్యాంకు అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ జనరల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖులు




**హైదరాబాద్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ జనరల్ సోమ శ్రీనివాస్‌రావును పలువురు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పోల విజయ్‌కుమార్, హైకోర్టు మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, తెలంగాణ అవోపా అధ్యక్షుడు సముద్రాల రమేష్, టీవీఎస్ మోటార్స్ షోరూమ్ అధినేత సర్ రవికుమార్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అడ్మినిస్ట్రేటర్ జనరల్‌ను కలిసిన ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తు కార్యక్రమాల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నందిగామ శ్రీకృష్ణ పత్తి గోదాంలో అగ్నిప్రమాదం

**-సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎసిపి లక్ష్మీనారాయణ, సీఐ ప్రసాద్**



**నందిగామ, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని వీర్లపల్లి రోడ్డులో గల శ్రీకృష్ణ పత్తి గోదాంలో శనివారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. ఆకస్మాత్తుగా మంటలు చెలరేగి గోదాంలో నిల్వ ఉంచిన పత్తి అగ్నికి ఆహుతి అయింది. బయట నుండి పొగ రావడం గమనించిన సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజన్, పోలీసులకు సమాచారం అందించారు. షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ, సీఐ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఎసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, “సీసీఐ సర్టిఫైడ్ అయిన శ్రీకృష్ణ పత్తి గోదాంలో మంటలు చెలరేగాయి. గోదాంలో పవర్ సప్లై లేకపోవడం, రాత్రి పడిన ఉరుములు, వర్షాల కారణంగా ప్రమాదం సంభవించిందా అనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం” అని తెలిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడం ఊరట కలిగించింది.

## జిల్లాలో సమృద్ధిగా వంటగ్యాస్,
# పెట్రోల్, డీజిల్ సరఫరా

**ప్రజలు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి సూచన**






**రంగారెడ్డి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ సమావేశ మందిరంలో సివిల్ సప్లై అధికారులు, గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల నిర్వహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, “జిల్లాలో గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరత లేదు. తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు అనవసర ఆందోళనకు గురికాకుండా, అవసరాన్ని బట్టి సమయానికి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలి. గ్యాస్ ఏజెన్సీలు షెడ్యూల్ ప్రకారం వినియోగదారుల ఇళ్ల వద్దకే సిలిండర్‌ను సరఫరా చేస్తాయి. ఎవ్వరూ గోదాముల వద్దకు వెళ్లి వేచి ఉండవద్దు” అని సూచించారు. అలాగే పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు అధిక మోతాదులో కొనుగోలు చేసి ఇండ్లలో నిల్వ చేయరాదని, దాని ద్వారా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహనాలకు మాత్రమే ఇంధనం సరఫరా చేయాలని, క్యాన్స్, బాటిల్స్‌లో ఇవ్వరాదని బంకు నిర్వాహకులకు ఆదేశించారు. ప్రాధాన్యత కలిగిన స్కూల్, ఆసుపత్రి వాహనాలకు సరఫరాలో ఎటువంటి అంతరాయం కలుగకుండా చూడాలని సూచించారు. “ప్రజలు అపోహలు, వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలి. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో సరఫరా నిరంతరంగా కొనసాగుతోంది” అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి వనజాత, సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, వ్యవసాయ శాఖ అధికారి ఉషా, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు, పెట్రోల్ బంకుల నిర్వాహకులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి



**నందిగామ, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఐదవసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికై చరిత్ర తిరగరాసిన బీరంగూడ జగన్మోహన్‌రెడ్డి, నూతన కమిటీ సభ్యులతో కలిసి శనివారం కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 16వ జిల్లా అదనపు జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ స్వాతి రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మల్యాల సాహితిని పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. న్యాయమూర్తులు నూతన కమిటీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, సభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు సబియా సుల్తానా, ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసమూర్తి, సహాయ కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి రహీముద్దీన్, లైబ్రరీ సెక్రటరీ జయమ్మ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ద్యాగ శంకర్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రూప్‌సింగ్, పబ్బే శ్రీశైలం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలు ట్యాక్సీ క్యాబ్స్ వినియోగించాలి -- సిఐటియు



**కరీంనగర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా ట్యాక్సీ క్యాబ్స్ ఓనర్స్ & డ్రైవర్స్ యూనియన్ సమావేశం పద్మనగర్ మార్క్ ఫీడ్ వద్ద రుద్ర తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైట్ ప్లేట్ కార్ల ద్వారా అక్రమంగా ట్రిప్పులు నడపడం వల్ల ట్యాక్సీ క్యాబ్ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ నుండి హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, తిరుపతి, శిరిడి యాత్రలకు వైట్ ప్లేట్ కార్ల ద్వారా ప్రయాణికులను తరలించడం వల్ల ట్యాక్సీ క్యాబ్ యజమానులు ఆదాయం కోల్పోతున్నారని తెలిపారు. బాబ్ల యాప్ ద్వారా ఇతర రాష్ట్రాల కార్లు కరీంనగర్ ప్రజలను బుక్ చేసుకుని వెళ్లడం వల్ల స్థానిక ట్యాక్సీ యజమానులు నష్టపోతున్నారని, అలాగే సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు కూడా కిరాయిలకు నడపడం వల్ల సమస్యలు పెరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వెంకటేశ్వర థియేటర్ బస్టాండ్ ముందు వైట్ ప్లేట్ కార్ల అడ్డాలను తొలగించాలని, రవాణా శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ ట్రావెల్స్‌లో కిరాయిల కోసం ట్యాక్సీ క్యాబ్స్‌ను మాత్రమే వినియోగించాలని, బాబ్ల యాప్‌ను రద్దు చేయాలని ఆయన కోరారు. నగర అభివృద్ధిలో భాగంగా కళాభారతి ముందు ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొండు ప్రభాకర్, ములుగు వీరాస్వామి, ఎల్దండి చందు, దొంగల శ్రీనివాస్ యాదవ్, ఆరేపల్లి మల్లేష్, బానోతు రాజేష్, శ్రావణ్, వెంగళ లక్ష్మారెడ్డి, కునుసోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మతల్లి సింహద్వార రోహణం




**హుస్నాబాద్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో ముదిరాజ్ కులదేవత శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయంలో సింహద్వార రోహణం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కొత్తగా నిర్మించిన దేవాలయ ద్వారప్రవేశం సందర్భంగా గ్రామస్తులు, కులస్తులు ఇంటింటి నుండి బిందెల నీళ్లు, కొబ్బరికాయలు, కుంకుమ, పసుపు తీసుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా చేరి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ, పెద్దమ్మతల్లి సింహద్వార రోహణం కార్యక్రమం కులస్తుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని తెలిపారు. ఈ వేడుకలో రాములు, ఎల్లయ్య, యాదగిరి, సమ్మయ్య, వెంకటయ్య, మొగిలి, మల్లేష్, కృష్ణ, సురేష్, శ్రీను, రాజు, రమేష్, నారాయణ, రాకేష్, సర్పంచ్ సంపత్, రమణారెడ్డి, భూక్య తిరుపతి, మొండయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్--జగ్జీవన్‌రామ్ ఉత్సవాల కమిటీ ఎన్నిక



**నాగర్‌కర్నూల్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ ఉత్సవాల కమిటీ ఎన్నిక శనివారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ నియోజకవర్గాల కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యమకారులు, అంబేద్కర్ వాదులు, ప్రజా నాయకులు పాల్గొన్నారు. ఉత్సవాలను ఏ విధంగా నిర్వహించాలి, మహనీయుల గొప్పతనాన్ని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, దళితులకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టే మార్గాలపై చర్చ జరిగింది. తరువాత 2026 సంవత్సరానికి ఉత్సవాల కమిటీ చైర్మన్, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్‌ను కలిసి బాధ్యతలను వివరించారు. ఈ కమిటీలో సభ్యునిగా ఎన్నుకోబడిన నాయకుడు జెట్టి చిన్నా వెంకటేష్, వంగూరి జయశంకర్, గోరటి సూరి, కూరాకుల శ్రీను, వినోద్ తదితర ఉద్యమ నాయకుల సహకారంతో ఎన్నిక జరగడం విశేషం.

# నేడు ఉచిత హోమియో వైద్య శిబిరం




**యాచారం, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యాచారం మండలం నక్కర్త--మేడిపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పీ.ఆర్.జీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త మాట్లాడుతూ హైదరాబాద్ మహదేవ్ హోమియో క్లినిక్ వైద్య నిపుణురాలు డాక్టర్ రాధిక (బిహెచ్ఎంఎస్, ఎండీ) ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగనుంది. ఈ శిబిరంలో నిపుణులు రక్తపోటు, మధుమేహ పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి తగిన మందులు అందజేయనున్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగనుంది. పరీక్షలకు వచ్చే వారు తమ పాత మందుల చీటీలు, పరీక్షా నివేదికలు ఉంటే వైద్యులకు చూపించేందుకు తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.

# ఏప్రిల్ 19న పూలే--అంబేద్కర్ జన జాతర

## విజయవంతం చేయాలని వక్తల పిలుపు



**నల్లగొండ, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహాత్మ జ్యోతిబా పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా ఏప్రిల్ 19న నల్లగొండలో జరగనున్న పూలే--అంబేద్కర్ జన జాతరను విజయవంతం చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎం.వి.ఎన్ ట్రస్ట్ భవనంలో జరిగిన సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను అధ్యక్షతన ప్రముఖ అడ్వకేట్ దర్శనం నరసింహ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నేలపట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ, "రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు గడిచినా కుల వివక్ష కొనసాగుతుండటం బాధాకరం. మహనీయులు సాధించిన హక్కులను కాపాడుతూ, సమానత్వం కోసం పూలే--అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలి" అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దుడుకు లక్ష్మీనారాయణ, బకరం శ్రీనివాస్, నారీ ఐలయ్య, వెంకటేశ్వర్లు, పాలడుగు ప్రభావతి, అద్దంకి రవీందర్, సయ్యద్ హాశం, మహమ్మద్ సలీం, చౌగోని సీతారాములు, మల్లం మహేష్, రాయల సీతారాములు, కట్టెల శివకుమార్, బండారు శంకర్, మోత్కూరి శ్రీనివాస్, కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విబిజి రాంజీ బిల్లు రద్దు చేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్**



**దేవరకొండ మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్).**
ఉపాధి కూలీల శ్రమను దోపిడీ చేస్తున్న వి బి జి రాంజీ బిల్లు రద్దు చేసి గతంలో ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . శనివారం రోజున కొండ మల్లేపల్లి మండలంలోని గాజి నగర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి ఈ సందర్భంగా మాట్లాడుతూ. చేసిన పనులకు వారం వారం వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నగత ఏడు వారాలుగా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు అందలేదని వెంటనే ఇవ్వాలని, పని ప్రదేశాలలో భూమి గట్టిగా ఉండటం వల్ల కూలి గిట్టుబాటు కావట్లేదు తెలిపారు. ఉపాధి కార్మికుల పట్ల కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని అలాగే చట్టం లేకుండా చేసే దురుద్దేశాన్ని తిప్పి కొట్టాలని కూలీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జాతీయ ఉపాధి హామీ చట్టంలో కార్మికుల సంక్షేమం కోసం ఉన్నటువంటి సౌకర్యాలను ఈ వీబీజీ రాం జి చట్టంలో పూర్తిగా తొలగించి కార్మికులకు నష్టం చేస్తుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిదలు కేటాయించింది కొత్తగా బిజెపి చేసిన చట్టంలో 90% నిధులు నుండి 60% కుదించింది .మిగతా 40% నిధులు ఆయా రాష్ట్రాలు భరించాలని చెప్పి ఉపాధి కల్పించే బాధ్యతనుండి క్రమంగా బీజేపీ ప్రభుత్వం తప్పుకుంటుంది అన్నారు. పది సంవత్సరాలుగా ఉపాది కూలీలకు బడ్జెట్లో కోతలు విధించుకుంటూ వస్తుంది. లక్షల కోట్ల రూపాయలు దేశలోని బడా కార్పొరేట్ సంస్థలకి రాయితి ఇస్తూ చట్టానికి కేంద్ర బడ్జెట్లో నిధులు తగ్గించడం అన్యాయమని అన్నారు సంవత్సరానికి 125 రోజులు పని కల్పిస్తున్నామని ప్రజల్ని మోసం చేస్తుందన్నారు. 95 వేల కోట్లతో 42 కోట్ల మంది ఉపాధి కార్మికులకు ప్రభుత్వం ఏ విధంగా 125 రోజులు పని కనిపిస్తుందని ప్రశ్నించారు?
125 రోజులు పనికి కల్పించాలంటే 3,50, లక్షల కోట్ల రూపాయల నిధులు అవసరం ఉంటుందని కానీ కేంద్ర ప్రభుత్వం 95 వేల కోట్లు మాత్రమే బడ్జెట్లో నిధులు కేటాయించిందని తెలియజేశారు .గతంలో సంవత్సరంలో ఎప్పుడైనా వంద రోజులు పని చేసుకునే అవకాశం కూలీలకు ఉండేది. ఈసారి అధికారికంగానే 60 రోజులపాటు ఉపాధిహామీ పనులు బంద్ చేయాలని చట్టంలో పేర్కొంది. గతంలో లో కార్మికుల సంక్షేమం కోసం పని ప్రదేశాలలో నీడకొసం టెంటు, త్రాగునీరు, మెడికల్ కిట్లు, మూడు కిలోమీటర్ల పై దూరంలో పనులు చేస్తే ట్రాన్స్పోర్ట్ చార్జీలు, పనిముట్లు తదితర సౌకర్యాలు ఉండేవి, ఈ కొత్త చట్టంలో ఈ సౌకర్యాలని తొలగించిందని తెలిపారు రాంజీ చట్టాన్ని రద్దు చేసే వరకు కార్మికులంతా కలిసి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జిల్లా అధికార యంత్రం వెంటనే పెండింగ్లో ఉన్న కూలీ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కావలి కృష్ణయ్య, సంఘం గ్రామ కమిటీ సభ్యులు బుడిగపాక అంజమ్మ, బత్తుల అంజమ్మ ,సుక్కమ్మ ,సాలమ్మ, విజయ, జక్కమ్మ ,చంద్రకళ, ముత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతిలోకి భారీగా చేరికలు



**రంగారెడ్డి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ జాగృతి పార్టీ బలోపేతమే లక్ష్యంగా రంగారెడ్డి జిల్లాలో శనివారం భారీగా చేరికలు జరిగాయి. నగరంలోని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్‌సింగ్, జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి సమక్షంలో, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కె. శివశంకర్ ఆధ్వర్యంలో చేవెళ్ళ, కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన వందమందికి పైగా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ జాగృతిలో చేరారు. కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్‌సింగ్, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లమల్ల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దూకుంట్ల నరేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితర నేతలు సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి మాట్లాడుతూ, "ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కీలకమైన సంధిదశలో ఉంది. ప్రజలు ఆశిస్తున్న అభ్యుదయకరమైన నాయకత్వాన్ని అందించేందుకు కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని తెలంగాణ జాగృతి సిద్ధంగా ఉంది. ఉద్యమకాలం నుండి తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని ప్రపంచవ్యాప్తం చేయడంలో కవిత పోషించిన పాత్ర అసామాన్యం. అదే స్ఫూర్తితో ఈ పార్టీ బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఎదుగుతుంది. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తూ, యువత, మహిళలు, బడుగు--బలహీన వర్గాలకు ఈ ప్రయాణం ఒక పెద్ద భరోసా అవుతుంది. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత రాజకీయ గందరగోళానికి తెరదించి, ప్రగతిశీల మార్గంలో తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేస్తుంది" అని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో సంగేరి నగేష్, పుట్నాల పరమేష్ గౌడ్, గుణాల మాధవరెడ్డి, గౌరవ్ కుమార్, గౌరవ్ మల్లేష్, తుమ్మలూరు అంజయ్య, గోల రాజు, వీరేష్, సంజీవరెడ్డి, నగేష్, షణ్ముఖ్ కుమార్, విశాల్, శివరామకృష్ణారెడ్డి, కార్తీక్ రెడ్డి, ఆనంద్ తదితర ముఖ్య నేతలు ఉన్నారు.

# ఆర్టీసీ సమస్యలపై ఉమ్మడి జిల్లాల సమావేశం



**హైదరాబాద్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాలక్ష్మి పథకం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో, నియోజకవర్గాల వారీగా అవసరమైన మౌలిక సదుపాయాలు, కొత్త బస్సులు, బస్ స్టేషన్‌ల అభివృద్ధి, కొత్త రూట్లు, డిపోలు, టాయిలెట్ నిర్మాణాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మూడు రోజులుగా ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలతో అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశం జరిగింది. ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో కొత్త బస్సులు, రూట్లు, స్టేషన్‌ల అభివృద్ధి, డిపోలు, టాయిలెట్ నిర్మాణాలపై వినతిపత్రాలు సమర్పించారు. వేములవాడ, కోరుట్ల, పెద్దపల్లి, రామగుండం, ఆదిలాబాద్, ఖమ్మం ప్రాంతాల్లో బస్సులు పెంచాలని, స్టేషన్‌లను ఆధునీకరించాలని, ప్రయాణికుల సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజా ప్రతినిధులు సూచించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. అన్ని బస్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. కొత్త బస్సులు అవసరాలున్న ప్రాంతాలకు పంపిస్తాం. అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలతో పాటు ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి



**గంగాధర, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా సాగునీటి సంఘాలకు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని ఉమ్మడి జిల్లా నీటి సంఘాల ఫోరం మాజీ అధ్యక్షుడు బి. రెడ్డి కరుణాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడిచినా ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలతో పాటు నీటి సంఘాల ఎన్నికలు కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాలో 525 నీటి సంఘాలు ఉన్నాయని, అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో 1997లో నీటి సంఘాలను ఏర్పాటు చేసి 100 ఎకరాల ఆయకట్టున్న సంఘాలకు ఎన్నికలు నిర్వహించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2008లో కాలపరిమితిని మూడు సంవత్సరాలకు పెంచి, ఆపై 2013 డిసెంబర్ 31 వరకు మరో రెండు సంవత్సరాలు పొడిగించిందని తెలిపారు. తరువాత స్పెషల్ ఆఫీసర్లను నియమించడం వల్ల సాగునీటి నిర్వహణపై పట్టింపు లేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించి నీటి సంఘాలను బలోపేతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అనంత విశ్వంలో సుమధుర పదం శ్రీరామ నామం

**-పట్టు వస్త్రాలు సమర్పించిన సర్పంచ్ వర్కాల బాల నారాయణ మాధవి దంపతులు.**



**దేవరకొండ మార్చి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** అనంత విశ్వంలో సుమధుర పదం శ్రీరామ నామమని సర్పంచ్ వర్కాల బాల నారాయణ పేర్కొన్నారు. డిండి మండలంలో గోనబోయినపల్లి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సీతారాముల కల్యాణం చూసి తరించిన వారి జన్మ సార్థకం అవుతుందన్నారు. సీతారాముల అనుగ్రహంతో సర్వదోషాలు తొలగిపోతాయని అన్నారు. సీతారాముల జీవితం ఆదర్శప్రాయమైందని అన్నారు. నిజాయితీ, సన్మార్గానికి నిలువెత్తు నిదర్శనమని చెప్పారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల నుంచి వైదొలగిన తర్వాత జరుపుకుంటున్న పెద్ద పండుగల్లో ఇదొకటని అన్నారు. శ్రీరామచంద్రుడి జన్మదినమైన చైత్రశుద్ధ నవమి హిందువులకు అత్యంత విశేషమైన పండుగ. ప్రతి ఇంట్లో ఈ వేడుకను జరుపుకుంటారని అన్నారు. శ్రీరామచంద్రస్వామి మధ్యాహ్నం అభిజిత్ ముహూర్తంలో జన్మించాడు. సత్యమార్గాన్ని అనుసరిస్తూ తండ్రి ఆదేశాన్ని పాటించిన రాముడు ఎన్నో కష్టాలు పడ్డాడు. పద్నాలుగేండ్ల పాటు అడవుల్లో ఉన్న తర్వాత అయోధ్య చేరుకున్నాడు. అప్పుడు జరిగిన శ్రీరామ పట్టాభిషేకం చైత్ర శుద్ధ నవమి నాడే జరిగిందని భక్తులు భావిస్తారు. శ్రీ సీతారాముల కల్యాణం జరిగింది కూడా ఇదే రోజే కావడం విశేషం. అందుకే శ్రీరామ నవమి నాడు ఎంతో వైభవంగా సీతారాముల కల్యాణం జరుపుతారు. భక్తులకు పానకం, వడపప్పు పంచిపెడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బద్దెల బాలింగయ్య ,నీలా నాగభూషణం, గన్నవరం అశోక్,ధనయ్య,కాసుల అశోక్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# గణితం పరీక్షకు 71 మంది విద్యార్థులు గైర్హాజరు

**--జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి**



**నల్లగొండ, మార్చి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** శనివారం జరిగిన పదవ తరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి తెలిపారు. మొత్తం 71 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు అయ్యారని రెగ్యులర్ విభాగంలో 99.73 శాతం, ప్రైవేట్ విభాగంలో 29.17 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలలో పకడ్బందీగా నిర్వహణ చేపట్టామని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 40 కేంద్రాలను, విద్యాశాఖాధికారులు 8 కేంద్రాలను తనిఖీ చేశారని ఆయన పేర్కొన్నారు.

## వేలం ద్వారా జిపికి ఆదాయం



గ్రామపంచాయతీ షెటర్స్ వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

**ఎలిగేడు, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు గ్రామపంచాయతీ పరిధిలోని 8 వాణిజ్య దుకాణ సముదాయాలు, కూరగాయల మార్కెట్‌కు శనివారం మండల పంచాయతీరాజ్ అధికారి సమక్షంలో వేలంపాట నిర్వహించారు.దుకాణ సముదాయాల ద్వారా నెలకు రూ.73,900, కూరగాయల మార్కెట్ ద్వారా సంవత్సరానికి రూ.80,000 ఆదాయం గ్రామపంచాయతీకి లభించనుంది. మిగిలిన 10 షెడ్లకు సోమవారం వేలంపాట జరగనుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్, గ్రామ కార్యదర్శి అంజలి, వ్యాపారస్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఉప సర్పంచ్ ముంజం నరేష్.

**ఎలిగేడు, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శమండల కేంద్రంలోని 1వ వార్డులో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్ శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎలిగేడు గ్రామ అభివృద్ధి కోసం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఈజీఎస్ నిధుల నుండి రూ.6 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి మౌలిక వసతుల కోసం నిధులు కేటాయిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బ్రహ్మోజు సంజీవ్‌కుమార్, పల్లె కార్తిక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శిక్షణా తరగతుల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



**కరీంనగర్ రూరల్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 శిక్షణా తరగతుల కార్యక్రమానికి 6వ డివిజన్ బొమ్మకల్ నుంచి పలువురు బీజేపీ నాయకులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మైకల వెంకటేష్, రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, అసిరి తిరుపతి, గాలిపెల్లి నారాయణ, కాల్వ రామచంద్రం, పెద్ది లక్ష్మణ్, నేరెళ్ళ రాజు, కాల్వ శ్రీకాంత్, తాత రాజకుమార్, పాదం సాయి కృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైరిస్క్ ప్రెగ్నెన్సీపై అప్రమత్తత అవసరం




**పెద్దపల్లి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గర్భధారణ సమయంలో తల్లి లేదా శిశువుకు ఆరోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితిని హైరిస్క్ ప్రెగ్నెన్సీగా పరిగణిస్తారని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో గైనకాలజిస్టు శ్రీనయన, క్రిటికల్ కేర్ నిపుణురాలు పల్లవి మాట్లాడుతూ ఇటువంటి సందర్భాల్లో నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీసే అవకాశముందని హెచ్చరించారు. డయాబెటిస్, రక్తపోటు, గుండె, లివర్, కిడ్నీ సమస్యలు ఉన్న మహిళలు గర్భధారణ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. థైరాయిడ్ సమస్యలు, శిశువు బలహీనత, గర్భసంచి సమస్యలు కూడా హైరిస్క్ కేటగిరీలోకి వస్తాయని చెప్పారు. గతంలో శస్త్రచికిత్సలు చేయించుకున్న మహిళలు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ప్రతి దశలో స్కానింగ్‌లు చేయించుకోవడం, గైనకాలజిస్టుతో పాటు అవసరాన్ని బట్టి ఇతర విభాగాల వైద్యుల సహకారం పొందడం ద్వారా తల్లి, శిశువును సురక్షితంగా కాపాడవచ్చని వైద్యులు తెలిపారు. రక్తపోటు నియంత్రణ, ఫ్యాటీ లివర్ వంటి సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రసవానంతరం తలెత్తే సమస్యలపై ముందుగానే అవగాహన కలిగి ఉండాలని హెచ్చరించారు.మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్నాకర్, బొంగోని హరీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో స్వచ్ఛ భారత్ వనమహోత్సవం హరిత హారంపై అవగాహన సదస్సు



**పెద్దపల్లి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని గాయత్రి విద్యానికేతన్‌లో శనివారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, వనమహోత్సవం హరిత హారంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే సత్యనారాయణ, జిల్లా స్వచ్ఛ భారత్ డైరెక్టర్ ఎస్ రాఘవులు విద్యార్థులకు పరిశుభ్రత ప్రాముఖ్యతను వివరించారు. గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ద్వారా పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం, వనమహోత్సవం ద్వారా చెట్లను నాటి పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు.విద్యార్థులు పరిశుభ్రతను పాటించడం, చెట్లను నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని ఈ సదస్సులో సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపాల్ విజయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతే దేశానికి వెన్నుముక

**సహకార సంఘం స్పెషల్ ఆఫీసర్ అహ్మద్ అలీ**




సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ అహ్మద్ అలీ

**ఎలిగేడు, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** "రైతే దేశానికి వెన్నుముక" అని సహకార సంఘం స్పెషల్ ఆఫీసర్ అహ్మద్ అలీ అన్నారు. దూళికట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సహకార వ్యవస్థను బలోపేతం చేసి రైతులకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు.ఎఫ్‌టిఓలో సభ్యత్వం నమోదు చేసి రూ.2,000 షేర్ క్యాపిటల్ చెల్లించిన రైతులకు మార్కెటింగ్ రంగంలో మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరుగుతోందని, త్వరలో పెద్ద మొత్తంలో గోదాములు నిర్మించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో మానిటరింగ్ అధికారి స్రవంతి, సీఈఓ రవీందర్ రెడ్డి, సర్పంచ్ మారం కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టల్స్ నిర్వహణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సంక్షేమ హాస్టల్స్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో హాస్టల్ వార్డెన్లతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు భోజనం చేసే సమయంలో, సాయంత్రం స్టడీ అవర్స్‌లో వార్డెన్లు తప్పనిసరిగా హాస్టల్స్‌లో ఉండాలని స్పష్టం చేశారు. మార్చి నెలాఖరు లోపు హాస్టల్స్‌కు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు.10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు ముగిసే వరకు, మిగిలిన తరగతి పిల్లలకు ఏప్రిల్ 23 వరకు స్టడీ అవర్స్ కొనసాగించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఏసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, హాస్టల్ వార్డెన్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో జెనెక్స్-2కె26 మేనేజ్మెంట్ ఎక్స్‌పో

**పెద్దపల్లి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి పట్టణంలోని ట్రినిటీ అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో జెనెక్స్-2కె26 మేనేజ్మెంట్ ఎక్స్‌పో ఘనంగా జరిగింది. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి కళాశాల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి, ఐడిబిఐ బ్యాంక్ మేనేజర్ పి. సందీప్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉత్తేజపరిచారు. దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ మేధస్సును ఉపయోగించి ఎంబీఏ వైపు మొగ్గు చూపాలని, కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉద్యోగావకాశాలు కల్పించేలా అధ్యాపకులు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన ప్రాంగణ నియామకాలలో ఎంబీఏ, ఇంజనీరింగ్ విద్యార్థులు పలు బహుళజాతీయ సంస్థల్లో ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ఈ ఎక్స్‌పోలో బీకాం




విద్యార్థులకు మేనేజ్మెంట్ గేమ్స్, బ్రాండింగ్, వివిధ కాన్సెప్ట్ ప్రాజెక్టులు ప్రదర్శనకు వేశారు. 900 మందికి పైగా విద్యార్థులు పాల్గొని 40 ఫార్మల్, ఇన్‌ఫార్మల్ ఈవెంట్స్‌లో తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణి గణేష్, చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆరిఫ్, డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, ఇతర విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం



**కరీంనగర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగంలోని ఐసీటీసీ, పిపిటిసిటి, డీఆర్‌సి, ఏఆర్టి, ఎస్ఎస్‌కె, టిఐ, ఎన్జీవో, ఎల్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని సమీక్షించారు. గత ఏప్రిల్ 2025 నుండి మార్చ్ 2026 వరకు ఉన్న లక్ష్యాలు, సాధించిన విజయాలను పరిశీలించారు. హెచ్ఐవి పరీక్షలు చేసి పేషెంట్లను ఏఆర్టి సెంటర్‌కు పంపించి ఉచిత మందులు అందించాలని సూచించారు. ప్రతి గర్భిణీ స్త్రీకి హెచ్ఐవి, సిఫిలిస్ పరీక్షలు తప్పనిసరిగా జరగాలని, పాజిటివ్ వచ్చిన వారికి పుట్టబోయే శిశువుకు వ్యాధి సోకకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైరిస్క్ గ్రూప్ వ్యక్తులను గుర్తించి వారికి హెచ్ఐవి, సుఖవ్యాధుల పరీక్షలు జరిపి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు డీఎంహెచ్వో డాక్టర్ సుధ రాజేంద్ర, డిపిసియు సిబ్బంది, డీపీఎం, ఐసీటీసీ, పిపిటిసిటి సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలి

**మంచిర్యాల, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

మున్సిపల్ అభివృద్ధి కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు. శనివారం లక్షెట్టిపేట మున్సిపల్ కార్యాలయంలో జరిగిన బడ్జెట్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల అభివృద్ధి కోసం బడ్జెట్ ప్రణాళికలు సమర్థవంతంగా రూపొందించి అమలు చేయాలని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సమీక్ష జరిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్, 2026-27 అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో ఖరారు చేశారు. 2026-27 సంవత్సరానికి గాను 25.80



కోట్ల అంచనా బడ్జెట్‌లో 3.42 కోట్లు సాధారణ ఆదాయం, 21.42 కోట్లు గ్రాంట్లు, 90 లక్షలు డిపాజిట్లు, అడ్వాన్సులు, 5.95 లక్షలు నిల్వగా ఉంటాయని తెలిపారు. తరువాత ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని డంప్‌యార్డ్‌లో జరుగుతున్న బయో మైనింగ్ పనులను పరిశీలించారు. పాత చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో వేరు చేసి పర్యావరణానికి హాని లేకుండా నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి, బయో మైనింగ్ ప్రక్రియను వేగవంతం చేసి పట్టణ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, చైర్‌పర్సన్ దొంత అంజలి, వైస్ చైర్‌పర్సన్ రాజేశ్వరి, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం విజయవంతం



**హుస్నాబాద్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 డేస్ యాక్షన్ ప్లాన్ కింద హుస్నాబాద్ మండలంలోని మిర్జాపూర్ పీహెచ్‌సీలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మైమూనా ఆధ్వర్యంలో, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రి మరియు మెడికల్ కాలేజ్ సూపర్ స్పెషాలిటీ వైద్యుల సహకారంతో నిర్వహించారు. ఆరు విభాగాల వైద్య సేవలు అందించగా, 17 గ్రామాలు మరియు మున్సిపాలిటీ పరిధికి చెందిన సుమారు 180 మంది ప్రజలు ఈ సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య అధికారి డాక్టర్ శ్రీరామ్, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, వాలంటరీ వర్కర్లు పాల్గొన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లపై బండి సంజయ్ వ్యాఖ్యలు


**కరీంనగర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్రెషన్‌లోకి వెళ్లారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రధానిపై దిగజారి మాట్లాడుతున్నారని, దక్షిణాది--ఉత్తరాది అంటూ ప్రాంతీయ విద్వేషాలు రగిలించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం డిజైన్ లోపానికి కేసీఆర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని, అయినప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ కుటుంబం సహా బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కవిత కొత్త పార్టీపై స్పందిస్తూ ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ ఏర్పాటు చేయవచ్చని, ప్రజల కోసం, పేదల కోసం పనిచేసే పార్టీకి మాత్రమే మనుగడ ఉంటుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ లోపం కేసీఆర్ వల్లేనని, రేవంత్ ప్రభుత్వం అవినీతిపరులను అరెస్ట్ చేయకుండా కేంద్రంపై నెపం మోపుతోందని



ఆరోపించారు. డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న వాదనను ఆయన ఖండించారు. అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచుతున్నప్పుడు దక్షిణాదికి నష్టం జరగదని స్పష్టం చేశారు. 6 గ్యారంటీల అమలు చేయలేక ప్రజల దృష్టి మళ్లించేందుకు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఇక ప్రజాప్రతినిధులందరూ తమ ఇళ్లపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుని ఆదర్శంగా నిలవాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు. కోటి ఇండ్లలో సోలార్ వ్యవస్థ ఏర్పాటు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యమని, ఇందుకోసం రూ.75 వేల కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. సబ్సిడీతో పాటు 80 శాతం లోన్ సౌకర్యం ఉండటంతో పేదలకు కూడా భారం లేకుండా సోలార్ ఏర్పాటు చేసుకునే వీలుందని చెప్పారు. కరీంనగర్‌లోని తన నివాసంపై సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసి, అధికారులతో కలిసి పనితీరును పరిశీలించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కరపత్రాలను విడుదల చేశారు. ఒక్కో ఇంటికి నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడమే లక్ష్యమని తెలిపారు. వ్యవసాయంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పీఎం కుసుం పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. తెలంగాణలో 1800 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని, రైతులు అదనపు విద్యుత్ ఉత్పత్తి చేసి డిస్కంలకు విక్రయించి ఆదాయం పొందవచ్చని సూచించారు.

# ఎఫ్ఎల్ఎస్ పరీక్ష విజయవంతంగా నిర్వహించాలి



**కరీంనగర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

భారత విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 30, 31 తేదీల్లో ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ (ఎఫ్ ఎల్ ఎస్) పరీక్షలు నిర్వహించనున్నారు. 3వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఎంపిక చేసిన 407 పాఠశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 20 పాఠశాలల్లో డైట్ కరీంనగర్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలు డిజిటల్ విధానంలో ట్యాబ్‌ల ద్వారా జరుగుతాయి. జగిత్యాల జిల్లా నుండి ఆరు, కరీంనగర్ జిల్లా నుండి ఎనిమిది, పెద్దపల్లి జిల్లా నుండి మూడు, సిరిసిల్ల జిల్లా నుండి ఒక పాఠశాల ఎంపికయ్యాయి. ఈ నెల 26, 28 తేదీల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ మొండయ్య, ఉపన్యాసకులు మహేశ్వరరెడ్డి, కరీంనగర్ జిల్లా ఏఎంవో అశోక్ రెడ్డి, జగిత్యాల జిల్లా ఏఎంవో చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లు శ్రీధర్, అభయ్ రాజ్, రవీందర్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి

**-- కలెక్టర్ చిత్రా మిశ్రా**

**తిమ్మాపూర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ప్రభుత్వ ప్రతిష్టాత్మక ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకంలో భాగంగా నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో కలెక్టర్ స్వయంగా ఇండ్లను పరిశీలించారు. లబ్ధిదారులు తుమ్మనవేణ రజిత, కుంటు రాధతో మాట్లాడి ఇప్పటివరకు ఇంటి నిర్మాణానికి అయిన



ఖర్చు, ప్రభుత్వం నుండి వచ్చిన బిల్లులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణం త్వరగా పూర్తి చేసుకొని పూర్తి లబ్ధి పొందాలని సూచించారు. హౌసింగ్, పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ కలెక్టర్, లబ్ధిదారులను ప్రోత్సహించి సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు. మోడల్ గ్రామాలుగా ఎంపికైన లబ్ధిదారుల ఇండ్లు నూరు శాతం పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు సంచాలకులు శ్రీనివాస్, డి.ఈ వెంకటరమణ, ఏ.ఈ శ్రీజ, ఎంపీడీవో మల్హోత్రా, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్యాలు ఆపాలని ఏఐవైఎఫ్ డిమాండ్



**హుస్నాబాద్ ,మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పేద ప్రజలను ప్రలోభాలకు గురిచేసి వారి జీవితాలను నాశనం చేస్తున్న ఫైనాన్స్ కంపెనీలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. అరచేతిలో స్వర్గం చూపిస్తామని చెప్పి పేద కుటుంబాలను అప్పుల బారిన పడేసి, తర్వాత అధిక వడ్డీలతో తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు తమ అవసరాల కోసం లోన్స్ తీసుకున్న తర్వాత నెల నెలా చెల్లింపులు చేయలేక తీవ్ర ఒత్తిడికి గురవుతూ కుటుంబ పోషణ కూడా కష్టంగా మారుతోందని తెలిపారు. 5 స్టార్, బజాజ్ వంటి ఫైనాన్స్ కంపెనీల ద్వారా లోన్స్ తీసుకున్నవారు అధిక వడ్డీల భారంతో నానా ఇబ్బందులు పడుతున్నారని, చెల్లింపులు ఆలస్యమైతే క్రిమినల్ నోటీసుల పేరుతో వేధింపులు చేస్తూ ప్రాణాలు తీసుకునే స్థితికి నెట్టేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విధంగా పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ఫైనాన్స్ కంపెనీలపై పోలీసులు, ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి మోసపూరిత చర్యలకు అవకాశం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# దురంధర్ సినిమా ప్రతి ఒక్కరూ చూడాలి



**మంథని, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రామగిరి మండలంలోని సెంటనర్ కాలనీలో బిజెపి ఎంపీటీసీల పోరం మాజీ జిల్లా అధ్యక్షుడు మెలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశభక్తి, త్యాగం, స్ఫూర్తి విలువలను ప్రతిబింబించే అద్భుతమైన చిత్రం దురంధర్ ప్రతి భారతీయుడు తప్పనిసరిగా చూడాలని అన్నారు. మన స్వాతంత్ర్యం వెనుక ఉన్న అమూల్యమైన త్యాగాలను గుర్తు చేస్తూ, యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ఈ చిత్రం గొప్ప మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. స్వేచ్ఛగా జీవిస్తున్న ఈ రోజుల్లో మనకు లభించిన స్వాతంత్ర్యం సాధారణ విషయం కాదని, అది ఎన్నో వీరుల పోరాటాలు, త్యాగాల ఫలితమని గుర్తుచేశారు. కాలేజీ విద్యార్థులు, యువత, యజమాన్యాలు ఈ సినిమాను తప్పనిసరిగా చూడాలని, దేశ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలనే స్ఫూర్తి కలిగించడంలో దురంధర్ సినిమా గొప్ప పాత్ర పోషిస్తుందని శ్రీనివాస్ అన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభించిన మేయర్ శ్రీనివాస్




**కరీంనగర్ రూరల్ , మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

: కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో తీగలగుట్టపల్లి 1వ అంగన్వాడీ కేంద్రంలో సాక్షం అంగన్వాడీ కార్యక్రమం భాగంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ చేతుల మీదుగా వాటర్ ప్యూరిఫైయర్ ప్రారంభించారు. జిల్లాలోని 269 అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కింటికి లక్ష రూపాయలతో ఎల్ఈడీ టీవీ, ఈసీసీఈ మెటీరియల్, రైన్ వాటర్ హార్వెస్టింగ్, బాల పెయింటింగ్, పోషణ వాటిక వంటి సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కరీంనగర్ అర్బన్ ప్రాజెక్ట్‌లో 35 అంగన్వాడీ కేంద్రాలకు ఈ సదుపాయాలు అందించనున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో మరిన్ని సదుపాయాలు కల్పించి పిల్లల హాజరు శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రీ స్కూల్ పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈసీసీఈ మేళాలో పిల్లల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సబితా, సూపర్వైజర్లు రాజమణి, శ్రీలత, కనకలక్ష్మీ, డిహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది కవిత, శైలజ, పిల్లలు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పారాక్వాట్ డైక్లోరైడ్‌పై పూర్తి నిషేధం విధించాలి



**న్యూఢిల్లీ, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

దేశవ్యాప్తంగా తీవ్ర ఆరోగ్య, పర్యావరణ సమస్యలకు కారణమవుతున్న పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై తక్షణమే సంపూర్ణ నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. జీరో అవర్‌లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ఎంపీ మాట్లాడుతూ పారాక్వాట్ వినియోగం వల్ల నేల, నీరు, ఇసుక తీవ్రంగా కాలుష్యం అవుతున్నాయని, వ్యవసాయ వ్యవస్థలపై దాని ప్రభావం తీవ్రమవుతోందని తెలిపారు. ఇది కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రాణాంతక ముప్పుగా మారిందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆత్మహత్యలకు ఈ రసాయనం "మరణాయుధం"గా మారిందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో దాదాపు 100 శాతం మరణాలు సంభవిస్తున్నాయని, ఇప్పటివరకు సమర్థవంతమైన యాంటిడోట్ లేకపోవడం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని పేర్కొన్నారు. రైతులు, పర్యావరణం, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పారాక్వాట్ తయారీ, విక్రయం, వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సహా వైద్య వర్గాలు కూడా ఇదే అంశంపై ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తూ నిషేధం కోసం బలమైన మద్దతు ఇస్తున్నాయని గుర్తుచేశారు. ప్రమాదకర రసాయనాలకు బదులుగా సురక్షిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఎంపీ కడియం కావ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## భారతదేశ ప్రజల సమస్యలపై ఎంపీ
# గడ్డం వంశీ కృష్ణ ఘాటైన ప్రశ్నలు



**న్యూఢిల్లీ, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**

: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై, ఇంధన ధరల పెరుగుదలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత 10 సంవత్సరాల్లో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉండడం సాధారణ ప్రజలపై భారంగా మారిందని ఆయన పేర్కొన్నారు. క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 50--60 డాలర్ల మధ్య ఉన్న సమయంలో కూడా పెట్రోల్ ధర లీటర్‌కు 100 వరకు పెరగడం అన్యాయం అని విమర్శించారు. ఈ కాలంలో ప్రభుత్వం సుమారు 25 నుండి 30 లక్షల కోట్ల వరకు పన్నుల రూపంలో వసూలు చేసిందని, ఆ డబ్బు ఎక్కడ వినియోగించబడిందో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, ఎల్పీజీ గ్యాస్ కొరతపై వస్తున్న నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయని ఎంపీ వంశీ కృష్ణ అన్నారు. దేశంలో కేవలం ఒక నెలకు సరిపడే గ్యాస్ నిల్వలు మాత్రమే ఉన్నాయనే వార్తలు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని తెలిపారు. హైదరాబాద్ సహా తెలంగాణలో పెట్రోల్ బంక్‌ల వద్ద ప్రజలు పెద్ద ఎత్తున చేరడం, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలను పానిక్ మోడ్‌లోకి నెట్టే విధంగా పరిస్థితులు మారకూడదని, సరఫరా వ్యవస్థను బలోపేతం చేసి, ఇంధన ధరలను తగ్గించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ కోరారు.

## సీసీ రోడ్ల మంజూరులో బిఆర్ఎస్ సర్పంచుల వివక్షత ఆరోపణలు




**హుస్నాబాద్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని బి ఆర్ఎస్ సర్పంచులు సీసీ రోడ్ల మంజూరులో వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. ఈజీఎస్ పనులలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులు ఉన్న గ్రామాలకు మాత్రమే సీసీ రోడ్లను మంజూరు చేసి, బి ఆర్ఎస్ సర్పంచులు ఉన్న గ్రామాలను విస్మరించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్కన్నపేట మండలంలోని మైసమ్మ వాగు తండా, జనగామ, కట్కూరు, కపూర్ నాయక్ తండా, గోవర్ధనగిరి గ్రామాలకు సీసీ రోడ్లను మంజూరు చేయలేదని వారు ప్రశ్నించారు. మేము కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రత్యక్ష ఓట్ల ద్వారా గెలిచిన సర్పంచులమే. మా గ్రామాల్లో కూడా అభివృద్ధి జరగాలి కదా అని వారు అన్నారు. రేగొండ, మల్చేరు తండా గ్రామాలకు సీసీ రోడ్లను మంజూరు చేసినప్పటికీ, బిల్లులు జనరేట్ చేసే విషయంలో అధికారులు నానా ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపించారు. వెంటనే తమ గ్రామాలకు కూడా సీసీ రోడ్లను మంజూరు చేయాలని, లేకపోతే 1000 మందితో కలిసి హుస్నాబాద్‌లోని మంత్రి క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధి విషయంలో రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అన్ని గ్రామాలకు సమాన దృష్టితో పనులను కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్, మైసమ్మ వాగు తండా సర్పంచ్ బొడ్డు ఈశ్వర్, రేగొండ గ్రామ సర్పంచ్ ఓనేష్, మల్చేరు తండా గ్రామ సర్పంచ్ మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## షెడ్యూల్డ్ కులాల యువతకు దరఖాస్తుల గడువు పొడిగింపు




**మంచిర్యాల, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

2025-26 సంవత్సరానికి గాను షెడ్యూల్డ్ కులాల కార్యకరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ ఆమోదిత మొదటి విడత పథకాల కోసం అర్హత గల ఎస్.సి. యువత దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఈ.ఈ. చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా రంగంలో ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన ఈ.వి. ద్విచక్ర వాహనాల లక్ష్యం 185 యూనిట్లకు గాను 608 దరఖాస్తులు, ఈ.వి. త్రిచక్ర వాహనాల సరకు/ప్రయాణికుల రవాణా లక్ష్యం 91 యూనిట్లకు గాను 838 దరఖాస్తులు, వ్యవసాయ పథకాలలో సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, వ్యవసాయ అనుబంధ భాగం లక్ష్యం 19 యూనిట్లకు గాను 73 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కావడం జరిగిందని తెలిపారు. ఆసక్తి, అర్హత గల షెడ్యూల్డ్ కులాల యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

### ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ ఆధీనంలోనే నడవాలి



**హుస్నాబాద్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం పరిధిలోనే నడపాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ఊరుకోబోమని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి హెచ్చరించారు. హుస్నాబాద్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సుల విషయంలో కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని, కార్మికుల సంక్షేమం కోసం జేఏసీ అండగా నిలిచి పోరాటం చేస్తుందని తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు కార్మికులకు అనుగుణంగా ఉండాలని, వ్యతిరేకంగా ఉంటే సహించబోమని స్పష్టం చేశారు. కరీంనగర్ టు డిపోలో ఎలక్ట్రికల్ బస్సులను పూర్తిగా ఆర్టీసీ ఆధీనంలోనే నడపాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగించే అనాలోచిత ధోరణి మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో ఈనెల 30న కరీంనగర్ టు డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులతో భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ కే. కొమురయ్య, కన్వీనర్ జే. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ సమక్షంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం



**గంగాధర, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో జరుగుతున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా వారోత్సవాల రెండవ దశలో భాగంగా గంగాధర మండలం మధురానగర్ గ్రామంలో లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ప్రారంభించారు. వి.ఏ.ఎస్. గార్డెన్స్ వద్ద ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆటో, లారీ, కార్ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. నిపుణ వైద్యులు సమగ్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి సూచనలు ఇచ్చారు. రోడ్డు ప్రమాదాల నివారణలో కంటి చూపు కీలకమని వైద్యులు, పోలీసులు అవగాహన కల్పించారు. డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం ద్వారా తమతో పాటు ప్రయాణికుల భద్రతను కాపాడవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీ విజయ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు రవికుమార్, రజిని, ఎంపీడీవో రాము, తహసిల్దార్ రజిత, ఎస్ఐలు వంశీకృష్ణ, రాజు, నరేష్ రెడ్డి, స్థానిక సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

## వీర్లపల్లిలో విద్యుత్ కష్టాలకు మోక్షం

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో వెలుగుల బాటలో స్వగ్రామం**



**వీర్లపల్లి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామంలో నెలకొన్న లో--వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో మూడు కొత్త 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి, 40 స్తంభాలతో ప్రత్యేక విద్యుత్ లైన్ నిర్మించారు. పాత స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ చర్యలతో గ్రామంలో 24 గంటల నిరంతరాయ విద్యుత్ సరఫరా అందుబాటులోకి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ గౌడ్, నవాజ్ రెడ్డి, చిందం నరసింహులు, ప్రభాకర్ రెడ్డి, చాకలి నరసింహ, ఎండి హైమాద్, దుబ్బ లక్ష్మయ్య, చాకలి శ్రీశైలం, కల్వకోలు రాఘవేంద్ర, చాకలి శ్రీనివాస్, పాలకొండ శ్రవణ్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పందిల్లా గ్రామంలో కూరగాయల మార్కెట్ టెండర్ వేలం



**శ్రీరాంపూర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పందిల్లా గ్రామపంచాయతీ ఆవరణలో ప్రతి మంగళవారం జరిగే కూరగాయల మార్కెట్ టెండర్ హక్కుల కోసం వారసంత వేలంపాట శనివారం జరిగింది. గ్రామంలోని ఔత్సాహికులు పోటీపడగా, ఇల్లందుల రాజుకుమార్ రూ.25,000కు టెండర్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య, ఉప సర్పంచ్ ధర్మల రవి, గ్రామ కార్యదర్శి మహేందర్, మాజీ ఎంపీటీసీ సదానందం, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్



**కరీంనగర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మెగా లోక్ అదాలతలను నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్ తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులను రాజీ రాజమార్గంగా పరిష్కరించేందుకు లోక్ అదాలతలను ఏర్పాటు చేశామని, దీని ద్వారా ఇరుపార్టీలు రాజీకి వచ్చి వారిపై ఉన్న కేసులను తొలగించుకోవచ్చని అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునే 3,840 క్రిమినల్, సివిల్ కేసులను గుర్తించామని తెలిపారు. లోక్ అదాలతల్లో రాజీ చేసుకున్న కేసులకు అప్పీలు చేసే అవకాశం ఉండదని, ఇరుపార్టీలకు సమయం ఆదా అవుతుందని వివరించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ క్షణిక ఆవేశంతో ఇరు వర్గాలు వేసుకున్న క్రిమినల్ కేసులు రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం పొందుతున్నాయని చెప్పారు. గత లోక్ అదాలత్‌తో పోలిస్తే ఈసారి 40 శాతం అధిక కేసులు రాజీ మార్గం ద్వారా సెటిల్ అయ్యాయని, దీనికి పోలీస్ అధికారులు కృషి చేశారని తెలిపారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లపై ప్రజల్లో మంచి అవగాహన పెరిగిందని, న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు, అధికారులు సహకారంతో ఎక్కువ మంది కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌ను వినియోగిస్తున్నారని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాణి మాట్లాడుతూ సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లను వినియోగించుకోవాలని కక్షిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్లు, పోలీస్ అధికారులు, ఇన్సూరెన్స్, బ్యాంక్, ఆర్టీసీ ప్రతినిధులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బల్దియా టెండర్ల రద్దుపై సిపిఐ ఆగ్రహం



**కరీంనగర్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగర పాలక సంస్థలో విలీన గ్రామాల అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు మంజూరు చేసి టెండర్లు పిలిచినప్పటికీ, వాటిని గుట్టుచప్పుడు కాకుండా రద్దు చేయడం వెనుక ఉన్న మర్మం ఏమిటో చెప్పాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. బల్దియాలో రద్దయిన టెండర్లను పునరుద్ధరించాలని కోరుతూ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయ ప్రధాన గేటు ముందు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం విలీన గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ, కొత్తగా ఏర్పడిన పాలకవర్గం కమిషన్ల కోసం అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బిజెపి పార్టీలు కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఒత్తిడి వల్లే టెండర్లను రద్దు చేశారని ఆరోపించారు. ప్రజల అభివృద్ధి పట్ల పట్టింపు లేకుండా కమీషన్ల కోసం టెండర్లను రద్దు చేయడం సిగ్గుచేటు చర్య అని, బండి సంజయ్ నిజంగా చిత్తశుద్ధి ఉంటే టెండర్ల రద్దు ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. టెండర్లను యథావిధిగా ఉంచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి అభివృద్ధి పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మంత్రుల చీకటి ఒప్పందాన్ని విలీన గ్రామాల ప్రజలకు కరపత్రాల ద్వారా తెలియజేస్తామని, ప్రజలను ఆందోళనలకు సిద్ధం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్, నగర కార్యవర్గ సభ్యులు మామిడిపల్లి హేమంత్, బాకం అంజన్న, కండే అజయ్, మార్క శ్రీనివాస్ గౌడ్, రమేష్, ఎల్లయ్య, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామచంద్ర స్వామి రథోత్సవంలోపాల్గొన్న ఎమ్మెల్యే

-నేనావత్ బాలునాయక్ .



**దేవరకొండ మార్చి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
చింతపల్లి మండలం గోడుకొండ్ల గ్రామంలో శనివారం ఉదయం సీతారామచంద్రస్వామి జాతర రథోత్సవ కార్యక్రమంలో భక్తులతో, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్. ఈ కార్యక్రమంలో చింతపల్లి మండలం మాజీ ఎంపీపీ కొండూరు భవాని పవన్ కుమార్ , గ్రామ మాజీ సర్పంచ్ అంగురేకుల గోవర్ధన్ , మాస భాస్కర్ , మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, మాజీ జడ్పీటీసీ హరినాయక్ , శేఖర్ గౌడ్ , మద్దెల కృష్ణ , ఊరె లక్ష్మణ్ గారు, ఖలీల్ , దేవస్థానం కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ విజయరమణారావుకు కృతజ్ఞతలు



ఎలిగేడు ఒకటవ వార్డు సభ్యుడు బ్రహ్మోజు సంజీవ్ కుమార్

**ఎలిగేడు, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు గ్రామ 1వ వార్డు సభ్యుడు బ్రహ్మోజు సంజీవ్‌కుమార్ తన వార్డులో చిరకాల కోరికగా ఉన్న సీసీ రోడ్డును నిర్మించేందుకు రూ.6 లక్షల నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం శనివారం సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాలనీవాసులు వార్డు సభ్యుడు సంజీవ్‌కుమార్‌ను అభినందించారు. తన వార్డు అభివృద్ధికి సహకరించిన ప్రభుత్వ విప్ విజయరమణారావు, సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ఉచిత వైద్య శిబిరంవియవంతం

-గ్రామ సర్పంచ్ కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి జి. భీమనపల్లి.



**దేవరకొండ మార్చి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
కామినేని హాస్పిటల్ వైద్య బృందంచే గుడిపల్లిమండలం, జి.భీమనపల్లి గ్రామ పంచాయతీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 12 మంది వైద్య నిపుణులచే 152 మందికి ఉచిత సేవలు అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో.. సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు పగిడిమర్రి వెంకటేశ్వర్లు సమక్షంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్నీ నిర్వహించామని తెలిపారు.ఈకార్యక్రమములో గుడిపల్లి మండల పార్టీ నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , ఉప సర్పంచ్ పల్లెటి సైదులు,వార్డ్ మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు,యువకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

-ఎస్ ఐ.బాలకృష్ణ.



**దేవరకొండ మార్చి 28 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలం పరిధిలోని వావిల్ కోల్ గ్రామంలో శనివారం నాడు మూడు ఇసుక ట్రాక్టరు లు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నరనే సమాచారంతో ఎస్ ఐ బాలకృష్ణ అక్కడికి చేరుకొని రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకోగా ఒక ట్రాక్టరు గల వ్యక్తి పరిపోయినాడు ఈ మూడు ట్రాక్టరులపై కేసు నమోదు చేయనైనది ఎవరైనా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ బాలకృష్ణ తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్




**దేవరకొండ మార్చి 28. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం నాడు దేవరకొండ న్యాయస్థానంలో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జ్ దేవరకొండ కె ,అనిత. మరియు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్నేహ ఇద్దరు పాల్గొని ఈరోజు జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్ లో కక్షిదారులు వారి వారి సమస్యలను పరిష్కరించుకొని సివిల్ క్రిమినల్ కేసులు రాజీ చేసుకోవాలని ప్రతి ఒక్కరు సమాజంలో కలిసి ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు సన్నాయిల ఉమామహేశ్వర్ ఏపీపీలు సంతోష్ కుమార్, రూపాంజలి , ఏ జి పి నేమ్మికంటి రమాశంకర్, సీనియర్ న్యాయవాదులు గాజుల ఆంజనేయులు లోహిత్ రెడ్డి, సివి భాస్కర్, యండి శోకత్ అలీ, యండి ముస్తాక్ అహ్మద్, సిఐ వెంకట్ రెడ్డి, రూరల్ సీఐ బీసన్న, కార్యదర్శి వనం జగదీశ్వర్, బ్యాంక్ అధికారులు, బిఎస్ఎన్ఎల్ అధికారులు, కోర్టు సిబ్బంది కక్షిదారులు పాల్గొన్నారు.

# లోక్అదాలత్ వేదికగా 169 కేసులు రాజీ

ఇబ్రహీంపట్నం జిల్లా సబ్‌కోర్టులో పరిష్కారం

**రంగారెడ్డి, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా లోక్అదాలత్‌లో ఇబ్రహీంపట్నం సబ్‌కోర్టు పరిధిలో శనివారం జరిగిన కార్యక్రమంలో మొత్తం 169 కేసులు రాజీ పడ్డాయి.మాడుగుల, ఫార్మాసిటీ, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కేసులు ఈ లోక్అదాలత్‌లో పరిష్కారం పొందాయి.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంతో సొంతింటి కల సాకారం - గుర్రం కేశవులు



**ఆమనగల్లు, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇందిరమ్మ ఇండ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతుందని మాజీ ఎంపీటీసీ గుర్రం కేశవులు అన్నారు. చంద్రాయన్‌పల్లి తండాలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంలో పాల్గొని లబ్ధిదారులు జాటావత్ జ్యోతి శంకర్, హౌసింగ్ డిఇ శైలజ, ఏఈ శాలినిలతో కలిసి ఇళ్లను ప్రారంభించారు.కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు అందజేస్తామని తెలిపారు. నిబంధనల మేరకు నిర్మాణాలు పూర్తి చేసి బిల్లులు పొందాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో పేదల సొంతింటి కల సాకారం అవుతోందని పేర్కొన్నారు.కార్యక్రమంలో తండావాసులు రాగ్య, శ్రీను, గోపాల్, రమేష్, శంకర్, కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం




**ఆమనగల్లు, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీ 10వ వార్డు విటాయిపల్లికి చెందిన వెంకటయ్య శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం గ్రామస్థులు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.వారి కుటుంబాన్ని పరామర్శించి, గ్రామస్థులు కలసి రూ.46,000, అదనంగా ఉప్పల వెంకటేష్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.3,000 సమకూర్చి బాధిత కుటుంబానికి అందజేశారు.

# ప్రత్యేక లోక్‌అదాలత్ లో 153 కేసులు పరిష్కారం



**ఆమనగల్, మార్చి 28 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆమనగల్ జూనియర్ సివిల్ జడ్జి--జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వరూప కాటమ్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ జరిగింది. సివిల్, క్రిమినల్ కేసులు కలిపి మొత్తం 153 కేసులు పరిష్కరించారు.ఈ సందర్భంగా గౌరవ న్యాయమూర్తి మాట్లాడుతూ, “కక్షిదారులు లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలి” అని సూచించారు.కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్, కోర్టు సూపరింటెండెంట్ మురళీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, కార్యదర్శులు విజయకుమార్ గౌడ్, కొప్పు కృష్ణ, మల్లేష్, శేఖర్, సీనియర్ న్యాయవాది లక్ష్మణ శర్మ, గణేష్ గౌడ్, సంతోష్, దేవేందర్, సర్దార్ నాయక్, మల్లేష్, శేఖర్, బీక్య నాయక్, ప్రభు నాయక్, శ్రీనివాస్, మహేశ్వర్, శివశంకర్, రమేష్, మహేష్, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు దుర్మరణం



**ఆమనగల్లు, మార్చి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పట్టణంలో శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పట్టణంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో కాచిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చెన్నకేశవ కాలనీకి చెందిన పల్లపు చరణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో పట్టణంలో విషాద వాతావరణం నెలకొంది.

# అసోసియేషన్ అనుమతి లేకుండా నూతన గోదాములు,దుకాణాలు వరంగల్ నగరంలో పెట్టొద్దు

-వరంగల్-హనుమకొండ- కాజీపేట జంట నగరాల ఎంప్టీ బాటిల్స్ వేస్ట్ పేపర్ -వేస్ట్ కాటన్ ఓల్డ్ ఐరన్ ప్లాస్టిక్ స్ర్కాప్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

-కొన్ని కార్పోరేట్ సంస్థలు గోదాములు,దుకాణాలు వరంగల్ నగరంలో ఏర్పాటు చేస్తే వందల కుటుంబాలు రోడ్డున పడతాయి



వరంగల్, మార్చి 28(నీలగిరి ఎక్స్ ప్రెస్): ది గ్రేటర్ వరంగల్ ఓల్డ్ , ఎంప్టీ బాటిల్,వేస్ట్ పేపర్, వేస్ట్ కాటన్ ఓల్డ్ ఐరన్ ప్లాస్టిక్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనుమతి లేకుండా ఎవరూ నూతన గోదాములు,దుకాణాలు ఏర్పాటు చేయకూడదని అధ్యక్షులు పల్లకొండ ప్రభాకర్, ఉపాధ్యక్షులు పాలకుర్తి సారంగపాణి,ప్రధాన కార్యదర్శి కటకం వేణుగోపాల్ కోశాధికారి యాదా విజయ్ ఉప కార్యదర్శి యాదా సత్యం హెచ్చరించారు.శనివారం ది గ్రేటర్ వరంగల్ ఓల్డ్ ఐరన్, ఎంప్టీ బాటిల్,వేస్ట్ పేపర్, ప్లాస్టిక్ స్క్రాప్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ( వరంగల్ - హనుమకొండ- కాజీపేట)జంట నగరాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులందరూ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వరంగల్ జంట నగరాలలో సుమారు 100 పైన షాపులు నడిపించుకుంటున్నారు. ఈ షాపుల వల్ల ప్రత్యక్షంగా పరోక్షంగా కొన్ని వందల కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు.

రెక్కడితే కాని డొక్కాడని పరిస్థితిలలో చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పోటీ ప్రపంచంలో మాకు సరైన వ్యాపారాలు లేక మేము ప్రస్తుతం చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. అయితే కార్పొరేట్ సంస్థల కన్ను వరంగల్ నగర వ్యాపారం పై పడిందని, త్వరలో కొందరు కార్పొరేట్ సంస్థలు హైదరాబాదులో ఉన్న డీలర్లు వరంగల్లో గోదాములు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మాకు సమాచారం తెలిసిందన్నారు.

వరంగల్లో కార్పొరేట్ సంస్థలు గోదాములు ఏర్పాటు చేస్తే మాలాంటి చిన్న వ్యాపారస్తులకు, ట్రాన్స్పోర్ట్ మిత్రులకు, హమాలి సోదరులకు, రోజువారి కూలీలకు తీరని నష్టం జరుగుతుందని, దీంతో వరంగల్ జంట నగరాల ఓల్డ్ ఐరన్ ఎంప్టీ బాటిల్స్ వేస్ట్ పేపర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు.

ఈ సమావేశంలో వరంగల్ జంట నగరాలైన వరంగల్- హనుమకొండ- కాజీపేట పరిధిలో మా ఓల్డ్ ఐరన్ అసోసియేషన్ అనుమతి లేకుండా ఎవరైనా హోల్సేల్ గా గాని, రిటైల్ గా గాని ఎలాంటి కొత్త గోదాములు, దుకాణాలు పెట్టవద్దని అసోసియేషన్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగిందన్నారు.

మా అసోసియేషన్ వారికి తెలియకుండా షాపులు లేదా గోదాము ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఈ విషయంపై వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ మరియు వరంగల్ ఓల్డ్ ఐరన్ ఎంప్టీ బాటిల్స్ ప్లాస్టిక్స్ క్రాప్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాలకుర్తి సారంగపాణి తీవ్రంగా ఖండించి అసోసియేషన్ తరపున ఎలాంటి సమస్య వచ్చినా పోరాడుటకై సిద్ధమని హామీ ఇచ్చారు.అదేవిధంగా ఈ విషయంపై వరంగల్ నగర ఎమ్మెల్యే దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మరియు విశ్రాంత ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందనారు.




# శ్రీలంక సివిల్ వార్ నేపథ్యంలో నవీన్ చంద్ర 'నీలిర'

## ఆకట్టుకుంటున్న ట్రైలర్!

తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు సమర్పణలో, నవీన్ చంద్ర, సనంత్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'నీలిర'. ఈ చిత్రం ఏప్రిల్ 03న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే..1988 నాటి శ్రీలంక అంతర్యుద్ధం (జఉజఅశ్రీ ఔఘితీ) నేపథ్యంలో సాగే చిత్రమని తెలుస్తుంది. కథ ఒక సందడిగా సాగే వివాహ వేడుకతో మొదలై, ఒక్కసారిగా యుద్ధం సృష్టించిన బీభత్సం వైపు మళ్లుతుంది. మారణహోమం మధ్య ఒక కుటుంబం ఎదుర్కొన్న ప్రాణభయం, మనుగడ కోసం వారు పడ్డ ఆవేదన మరియు అణచివేతకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని దర్శకుడు సోమీధరన్ వెండితెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించారుఈ సినిమాలో నవీన్ చంద్ర తన నటనతో ఆకట్టుకోగా, సనంత్, రూప కొడువాయూర్ మరియు కపిల వేణు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. 'ఖ' అందించిన నేపథ్య సంగీతం ఈ యుద్ధ వాతావరణానికి మరింత బలాన్ని చేకూర్చింది. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్ పతాకంపై కార్తికేయన్ సంతానం, కార్తీక్ సుబ్బరాజు నిర్మించిన ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటికి చెందిన స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది. ఇటీవల జరిగిన సినిమా వేడుకకు వెట్రిమారన్, లోకేష్ కనగరాజ్ మరియు ఏఆర్ మురుగదాస్ వంటి దిగ్గజ దర్శకులు హాజరై, యుద్ధం వెనుక ఉన్న సామాన్య మనుషుల బాధలను ఈ సినిమా ప్రతిబింబిస్తుందని ప్రశంసించారు. భారీ అంచనాలతో రూపొందిన ఈ చిత్రం ఏప్రిల్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## మాల్దీవుల్లో చిల్ అవుతున్న దృశ్యం పాప..




# చెల్లి నిర్మాత... అన్న హీరోగా బరిలోకి

## వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



# ఆ సినిమా పైనే ఆశలు పెట్టుకున్న వైష్ణవి..

సోషల్ మీడియా ద్వారా క్రేజ్ తెచ్చుకున్న భామల్లో వైష్ణవి చైతన్య ఒకరు. ఈ చిన్నది సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతే కాదు ఈ అమ్మడు పలు షార్ట్ ఫిలిమ్స్ లోనూ నటించి ఆకట్టుకుంది.హీరోయిన్ రేంజ్ అందంతో ఈ కుర్రది కుర్రాళ్ల గుండెల్లో బాణాలు గుచ్చింది. కెరీర్ బిగినింగ్ లో పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి మంచి మార్కులు కొట్టేసింది. ఆతర్వాత హీరోయిన్ గా మారి సినిమాలు చేస్తుంది. బేబీ సినిమాతో హీరోయిన్ గా మారింది వైష్ణవి.సాయి రాజేష్ దర్శకత్వంలో, ఆనంద్ దేవరకొండ నటించిన బేబీ సినిమా భారీ విజయాన్ని అందుకుంది. చిన్న సినిమాగా వచ్చిన ఈ మూవీ.. ఎవ్వరూ ఊహించని విధంగా సినిమా హిట్ అవ్వడంతో పాటు నటీనటులు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది.బేబీ సినిమా తర్వాత లవ్ మీ అనే సినిమా చేసింది. ఈ సినిమాడిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు ఎపిక్ అనే సినిమా చేస్తుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఈ సినిమా తప్ప వైష్ణవి చేతిలో మరో సినిమాలేదు. దాంతో ఈ సినిమా పై భారీ ఆశలు పెట్టుంది ఈ అమ్మడు.ఎపిక్ సినిమా హిట్ అయితే ఈ చిన్నదానికి అవకాశాలు క్యూ కడతాయి. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు. రెగ్యులర్ గా ఫోటోలు పంచుకుంటూ అభిమానులను ఆకట్టుకుంటుంది. గ్లామరస్ ఫోటోలతో పాటు ట్రెడిషనల్ ఫోటోలను కూడా పంచుకుంటుంది ఈ కుర్ర భామ.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.